క్లుప్తంగా

నేడు కారంచేడులో పర్యటించనున్న ఆమంచి

కారంచేడు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న ఆమంచి మొదటిసారిగా శుక్రవారం కారంచేడు మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు కారంచేడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మండలంలోని స్వర్ణ, జరుబులవారిపాలెం, ఆదిపూడి గ్రామాల్లోను పర్యటిస్తారని పార్టీ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు తప్పకుండా హాజరు కావాలని వారు పేర్కొన్నారు.

ప్రతిభామూర్తులు సాహిత్య సభ రేపు

అద్దంకి: పట్టణంలోని కేర్ అండ్ క్యూర్ హోమియో వైద్యశాల ఆవరణలో ఈనెల 25న సాయంత్రం 6 గంటలకు ప్రతిభామూర్తులు సాహిత్య కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షుడు అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలో సినీ నటుడు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, ఘంటసాల వెంకటేశ్వరరావు గురించి అన్నమనేని వెంకట్రావు, చెన్నుపాటి రామాంజనేయులు ప్రసంగించనున్నట్లు తెలిపారు. సభకు సాహితీ వేత్తలు, సాహిత్య అభిమానులతోపాటు అందరూ ఆహ్వానితులేనని చెప్పారు.

శాప్‌నెట్ స్టూడియోను పరిశీలించిన చైతన్య


స్టూడియో ఏర్పాట్లను పరిశీలిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: హైద్రాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సొసైటీ ఫర్ (శాప్‌నెట్) స్టూడియోను రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య గురువారం పరిశీలించారు. స్టూడియోలో ఏర్పాటు చేస్తున్న వసతులు, సాంకేతిక పరికరాలను ఆయన పరిశీలించారు. అధికారులతో స్టూడియో ఏర్పాట్ల గురించి చర్చించారు.

అనాథ ఆశ్రమ నిర్మాణానికి ఆర్థిక సాయం


ఆశ్రమ నిర్వాహకుడికి విరాళం అందజేస్తున్న దాత కోటయ్య

మార్టూరు: మండల కేంద్రంలో నిర్మాణం జరగుతున్న అమ్మ అనాథాశ్రమ నూతన భవనం నిర్మాణం కోసం వృద్ధుడైన ఓ చిరుద్యోగి గురువారం రూ.25 వేలు ఆర్థిక సాయమందించాడు. జొన్నతాళి గ్రామానికి చెందిన నార్నె కోటయ్య ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో నెలకు రూ.12 వేలు వేతనంతో పనిచేస్తుంటాడు. తనలాంటి వృద్ధులకు చివరిదశలో ఆసరాగా ఉండటం కోసం నిర్మిస్తున్న ఆశ్రమ నిర్మాణానికై కోటయ్య తన వంతు సాయంగా తన రెండు నెలల వేతనాన్ని ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందుకు గురువారం విరాళంగా అందజేశాడు.

నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

చీరాల టౌన్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇంటి పట్టా పొందిన ప్రతి లబ్ధిదారులు ఇంటినిర్మాణ పనులు ఉగాది కల్లా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ ఎ.రామగోవింద రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని చీరాలనగర్ గ్రామ పంచాయతీలోని జగనన్న లే అవుట్‌లో ఇంటి నిర్మాణ పనులను డీఈ పరిశీలించి పలు సూచనలు అందించారు. అనంతరం లబ్ధిదారులతో హౌసింగ్ అధికారులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో హౌసింగ్ డీఈ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు కలగా మిగిలిన సొంతింటిని అందించేందుకు ఇంటిపట్టాలు అందించి నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. ఇంటి పట్టా పొందిన లబ్ధిదారులు ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

దూడలపై వీధి కుక్కల దాడి

కారంచేడు: హైద్రాబాద్‌లో వీధి కుక్కలు చిన్నారులపై దాడిచేస్తున్న ఘటనలు టీవీల్లో చూశాం. మండలంలోని తిమిడెదపాడు గ్రామంలోను వీధి కుక్కల స్వైర విహారంతో ఇంటి ఆవరణలో, పశువుల కొష్టాల వద్ద కట్టేసి ఉండే గేదె దూడలపై దాడులు చేశాయి. ఎక్కడ పడితే అక్కడ కొరికి గాయపరియాయి. గురువారం ఉదయం గ్రామానికి చెందిన దండా వాసుబాబు, కందుకూరి చంద్రమౌళిలకు చెందిన గేదె దూడలను కుక్కలు గాయపరిచాయి. వీధి కుక్కలపై గతంలో పంచాయతీలో ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యమని గ్రామస్తులు వాపోతున్నారు.

పంట లెక్క పక్కాగా..


భీమవరం ఆర్బీకే పరిధిలో ఈ-కేవైసీ చేయిస్తున్న ఏడీఏ మోహనరావు


వీరన్నపాలెంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

- ఈ-క్రాప్ నమోదుతో ప్రభుత్వ ఫలాలు
- నియోజకవర్గంలో 88.66% నమోదు
- ఈనెల 28 వరకు అవకాశం

పర్చూరు: రైతులు కష్టపడి పండించిన పంటసాగు ప్రయోజనాలను కల్పించేందుకు ప్రభుత్వం ఈ-క్రాప్ విధానాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు, పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తోంది. అంతేకాక రైతులు పండించిన దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. కరువు, అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయినప్పుడు పరిహారం అందిస్తోంది. రైతులకు ఈ ప్రయోజనాలు అందాలంటే ఈ-క్రాప్ నమోదు చేయించుకోవడం తప్పనిసరి.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవడం ఇలా..

వ్యవసాయశాఖ సిబ్బంది ఈ-కర్షక్ యాప్‌లో రైతుల వివరాలు, పంటల సాగు వివరాలను నమోదు చేస్తారు. మొదట ఆర్బీకేల్లో రైతుల వివరాల నమోదు, క్షేత్రస్థాయిలో పంటల నమోదు, చివరగా ప్రతి రైతుతో ఈ-కేవైసీ నమోదు చేయించాలి.

నమోదు చేసుకున్న రైతులకే ప్రభుత్వ పథకాలు..

ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయి. ఇన్‌పుట్ సబ్సిడీ పెట్టుబడి సాయం, పంటల బీమా, పంట నష్టపరిహారం, పంటల గిట్టుబాటు ధర, ఎరువులు, పురుగుమందులు వంటివి రాయితీపై అందుతాయి. పంట నమోదు చేయించుకున్న రైతులు ఈ-కేవైసీ కూడా చేయించుకోవాలి.

నియోజకవర్గంలో పంట నమోదు వివరాలు ఇలా...

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో 32,898 మంది రైతులు 1,08,239 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. రైతులు ప్రధానంగా పొగాకు, శనగ, మిర్చి, జొన్న, మొక్కజొన్న, వరి, వేరుశనగ పంటలతో పాటు కూరగాయలు కూడా సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో వ్యవసాయశాఖ సిబ్బంది 88.66 శాతం ఈ-క్రాప్ నమోదుతో పాటు, ఈ-కేవైసీ పూర్తి చేశారు. ఈ నెల 28 వరకు అన్ని గ్రామాల్లో ఈ-క్రాప్‌తో పాటు ఈకేవైసీ నమోదు ప్రక్రియ కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.

వందశాతం పూర్తి చేసేలా చర్యలు..



పంటల నమోదు ప్రక్రియ వంద శాతం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించాం. వ్యవసాయశాఖ సిబ్బంది పొలాల వద్దకే వెళ్లి పంట నమోదు చేస్తున్నారు. రైతులందరూ ఈ నెల 28వ తేదీలోగా ఈ-క్రాప్‌తో పాటు, ఈ-కేవైసీతో పాటు ఆధార్ అనుసంధానం చేయించుకోవాలి.
–మోహనరావు, ఏడీఏ పర్చూరు

మండలాల వారీగా ఈ-కేవైసీ నమోదు శాతం..

మండలం	రైతులు	సాగు విస్తీర్ణం	ఈ-కేవైసీ (ఎకరాలు)	నమోదు శాతం (ఎకరాలు)
పర్చూరు	10,611	36337	26206	75
కారంచేడు	5431	16033	13312	83
ఇంకొల్లు	5647	17052	14702	87
యద్దనపూడి	3093	13122	12395	95
మార్టూరు	4022	13113	12648	97
చినగంజాం	4094	12582	12132	96
మొత్తం	32,898	1,08,239	91395	88.66

పార్టీలో పలువురికి కీలక పదవులు


చింతల పేరయ్య


కాటుకూరి బాబురావు


పులికం కోటిరెడ్డి


జంపాని రవి


కే.శ్రీనివాసరెడ్డి

చినగంజాం: పార్టీని బలోపేతం చేసే దిశగా వైఎస్సార్ సీపీ పలువురికి పదవులు కట్టబెట్టింది. బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా మండలంలోని చింతగుంపల గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది కాటుకూరి బాబురావు నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాదిగా ఉన్న ఆయన తాజాగా ఎంపీటీసీ ఎన్నికలలో ఎంపీటీసీగా ఎంపికై వైఎస్ ఎంపీపీగా ఉన్నారు.

సేవాదళ్ అధ్యక్షుడిగా కోటిరెడ్డి..

జే.పంగులూరు: మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పులికం కోటిరెడ్డికి జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. వీరికి గతంలో ఏఎంసీ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. కొండమంజులూరు గ్రామానికి చెందిన జంపాని రవి బాపట్ల జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా నియమితులైయ్యారు. వీరు గతంలో మండల ఎంపీపీ, ఏఎంసీ చైర్మన్‌గా చేశారు.

జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా చింతల..

బల్లికురవ/అద్దంకి: బాపట్ల జిల్లా రైతు విభాగం అధ్యక్షుడుగా చింతల పేరయ్యను ఎంపిక చేయటంపై మండలంలోని వివిధ గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక నేతలు, పేరయ్యను బల్లికురవలో అభినందనలతో ముంచెత్తారు. అలాగే జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా అద్దంకి మండలంలోని శంఖవర్పాడుకు కొంచ శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాచిన చెంచు గరటయ్య, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

సుబ్బారావు సేవలు మరువలేనివి


సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కృష్ణమోహన్

పర్చూరు: ఇటీవల పర్చూరు కు చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ లింగిశెట్టి సుబ్బారావు మృతి చెందగా, మృతుని కుటుంబ సభ్యులను నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ గురువారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతుడు సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఆయన వెంట మండల కన్వీనరు కఠారి అప్పారావు, పర్చూరు ఉపసర్పంచ్ గాదె సురేష్, దేవరపల్లి ఉప సర్పంచ్ తోకల కృష్ణమోహన్, కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, నాయకులు జంగా అనీల్‌కుమార్, ఆకుల హేమంత్, అడపా సుధాకరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఆమంచి వెంకటసుబ్బారావు, రామకృష్ణ, గర్నెపూడి రవిచందు, కాకోలు వెంకటేశ్వర్లు, గర్నేపూడి రవితేజ, నూతలపాడు సర్పంచ్ చిన్నయ్య, కొత్తపాలెం సర్పంచ్ భూషిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ కాలేషా, కారంచేడు మండల కోఆప్షన్ సభ్యులు నూర్ అహ్మద్, పర్చూరు సొసైటీ అధ్యక్షులు కుక్కపల్లి నాగేశ్వరరావు, క్రిష్ణంశెట్టి రమేష్, రావువారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు


హాజరైన కన్వీనర్లు, వలంటీర్లు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

- మార్చి 18 నుంచి జగనన్నే మా భవిష్యత్
- ఎమ్మెల్యే కరణం బలరాం, జేసీఎస్ రీజినల్ కోఆర్డినేటర్ రవీంద్రారెడ్డి

వేటపాలెం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు మండల, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు పేర్కొన్నారు. గురువారం ఆణుమల్లిపేటలోని కళ్యాణ మండపంలో మండల పార్టీ అధ్యక్షుడు కొలుకుల వెంకటేష్ అధ్యక్షతన మండలంలోని సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులకు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే కరణం బలరాం, పార్టీ జేసీఎస్ రీజినల్ కో–ఆర్డినేటర్ కందుల రవీంద్రారెడ్డి, వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తమకు కేటాయించిన 50 గృహాల్లో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించాలో దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో గాని, దేశంలో ఏ సీఎం చేయని విధంగా అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలును ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టారన్నారు. తమకు కేటాయించిన ఇళ్లలో పూర్తిస్థాయి సమాచారం సేకరించి లోటుపాట్లను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు పార్టీ ముఖ్యనేతల దృష్టికి తీసుకురావాలన్నారు. రానున్న ఎన్నికల్లో కరణం వెంకటేష్‌ను గెలిపించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసే బాధ్యతను గృహ సారథులు బాధ్యత తీసుకోవాలని కోరారు. మండలంలో 60 మంది కన్వీనర్లు, 426 మంది వలంటీర్లు, 952 మంది గృహసారథులు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు లేళ్ల శ్రీధర్, కట్టా గంగయ్య, మున్నంగి అరుణ్‌కుమార్, జార్జీ శ్యామేలు, చుండూరి వాసు, జంగిలి రామారావు, కందేటి రమణ, కావూరి రమణారెడ్డి, పులి వెంకటేశ్వర్లు, బొడ్డు సుబ్బారావు, బట్టా అనంతలక్ష్మీ, రొండా భరత్, పృథ్వీ చంద్రమోహన్, జమ్మి ప్రసాద రెడ్డి, అందె కృష్ణ, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత

- ఎమ్మెల్యే కరణం బలరాం


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: రాష్ట్రంలో ఆర్థికలోటు ఉన్నప్పటికీ ప్రభుత్వ విద్యకు ఎనలేని ప్రాధాన్యతను కల్పిస్తోందని, ఇటువంటి అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత భవిష్యత్ పొందాలని ఎమ్మెల్యే కరణం బలరాం విద్యార్థులకు సూచించారు. బుధవారం ఆయన సర్వేపల్లి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకంలో మోనూ అమలు చేస్తున్నారా లేదా అని విద్యార్థలను అడిగారు. ఫైర్ ఆఫీస్ గేటు వద్ద రైల్వే ట్రాక్ నిమిత్తం మహిళా కళాశాల సమీపంలో నిర్మిస్తున్న మంచినీటి పైప్‌లైన్, డ్రైనేజీ నిర్మాణ పనులను బలరాం పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కమిషనర్ యేసయ్య, కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావ్, బత్తుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉన్నత లక్ష్యం అవసరం


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సభ్యులు

చీరాల అర్బన్: విద్యార్థులందరూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదవాలని 108 రిటైర్డ్ సీఈవో చంగవల్లి వెంకట్ అన్నారు. చీరాల ఎస్ఆర్‌పీఎం హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసిన చంగవల్లి వెంకటరమణయ్య శతజయంతి ఉత్సవాన్ని గురువారం స్థానిక మున్సిపల్ ఓపెన్ థియేటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్ఆర్‌పీఎం హైస్కూల్‌లో 28 ఏళ్ల పాటు వెంకటరమణయ్య మాస్టారు పనిచేసి ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.వెంకటేశ్వరప్రసాద్, నల్లూరి బ్రహ్మం, రొటేరియన్ గుర్రం రాఘవరావు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే మంచి ఆరోగ్యం


వ్యాయామశాలను ప్రారంభిస్తున్న వెంకటేష్

చీరాల: ప్రస్తుత అధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరూ వ్యాయమం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. పట్టణంలోని 29వ వార్డు పరిధిలోని నూతనంగా నిర్మించిన ఆంధ్రరత్న వ్యాయామ సంఘ భవనాన్ని వెంకటేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాయమశాల ద్వారా చుట్టు పక్కల ప్రాంతాల వారు ఉచితంగా వినియోగించుకునే అవకాశం కల్పించినందుకు కమిటీని అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బత్తుల అనిల్, కంపా అరుణ్, మించాల సాంబశివరావు, కాగితాల ప్రకాష్, సంఘ అధ్యక్షుడు బుద్దాబత్తుని వెంకట మారుతి ప్రసాద్, జొన్నాదుల శ్రీనివాసరావు, తుమ్మా శ్రీనివాసరావు, తుమ్మా బుజ్జి, పడవల శ్రీనివాసరావు, వంగర శ్రీనివాసరావు, వల్లెపు శ్రీను, కుంచాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి స్టీల్ ర్యాక్ బహూకరణ

మేదరమెట్ల: మండల కేంద్రం కొరిశపాడు గ్రామ గ్రంథాలయంలోని పుస్తకాలను భద్రపరచేందుకు గాను గ్రామానికి చెందిన యద్దల సుబ్బరామిరెడ్డి స్టీల్ ర్యాక్‌ను గురువారం లైబ్రేరియన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు సుగుణరావు దాతకు ధన్యవాదాలు తెలిపారు.

డీవీఎం సత్యనారాయణకు సన్మానం


డీవీఎం సత్యనారాయణను సన్మానిస్తున్న సాహితీవేత్తలు

అద్దంకి: పూర్వ కాలంలో మహాజ్ఞానం కలిగిన మహనీయులు తమలోని అతీంద్రియ శక్తులను లోక కల్యాణం కోసం ఉపయోగించారని ప్రజలు నమ్ముతుంటారని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇప్పగుంట మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని రామసుశీల నిలయంలో గురువారం రాత్రి సృజన ఆధ్వర్యంలో 'అతీంద్రియ శక్తులు' అంశంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. కార్యక్రమానికి సృజన అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత యుగాల్లోని రుషులు, దేవతలు, మహాపురుషులు, రామకృష్ణ పరమహంస వంటి మహనీయుల్లో అతీంద్రియ (మహాజ్ఞానం)శక్తులు కలిగి ఉన్నారన్నారు. తరువాత నాగభైరవ కోటేశ్వరరావు స్మారక పురస్కార గ్రహీత డీవీఎం సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకర దత్తు, లక్కరాజు శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకరరావు, అంజాద్ బాషా, కూరపాటి రామకోటేశ్వరరావు, జే ప్రతాప్, నాగసూరి వెంకటసుబ్బారావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, వామరాజు వెంకటేశ్వర్లు, నిమ్మరాజు నాగేశ్వరరావు, పసుపులేటి ఆంజనేయులు, పీసీహెచ్ కోటయ్య, అద్దకి లెవీ ప్రసాద్, సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రలోభపెడితే కేసులు

బల్లికురవ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ చేస్తే కేసులు నమోదు చేస్తామని బల్లికురవ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జీ. సీతామహాలక్ష్మి హెచ్చరించారు. గురువారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో పోలీసులతో కలిసి పలు వాహనాలను తనిఖీ చేశారు. ఓటర్లు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. మద్యం, డబ్బు పంపిణీ చేస్తే ఎంతటివారిపైనైనా కేసులు నమోదుతో డబ్బును సీజ్ చేస్తామని చెప్పారు. తనిఖీలో బల్లికురవ స్టేష్ ఏఎస్సై సీ. బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్‌కి తీవ్రగాయాలు

వేటపాలెం: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌లో విద్యుదీకరణ పనులు చేస్తున్న ఎలక్ట్రీషియన్‌కి గురువారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో రెండు చేతులు కాలిపోయాయి. ఎలక్ట్రీషియన్‌ది ఒడిశా రాష్ట్రానికి చెందిన పాండా. స్మార్ట్ పాయింట్‌లో విద్యుదీకరణ పనులో భాగంగా కెపాసిటర్‌కు కనెక్ష ఇస్తున్న క్రమంలో అతడికి షాక్ కొట్టింది. స్థానికులు క్షతగాత్రుడిని చీరాల ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు.

దివ్యాంగుల మెడికల్ క్యాంప్ రేపు

అద్దంకి: సమగ్ర శిక్ష బాపట్ల వారి ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉదయం 9 గంటలకు అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, కొరిశపాడు, జే పంగులూరు మండలాల్లోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు మెడికల్ అసెస్‌మెంట్, స్క్రీనింగ్ క్యాంప్‌ను అద్దంకి ప్రభుత్వ వైద్యశాల రోడ్‌లోని పోస్టాఫీసు ఎదురుగా ఉన్న పాత ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తారని మండల విద్యాశాఖాధికారి రాఘవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 16 సంవత్సరాల్లోపు ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలు హాజరు కావాలని కోరారు. వైకల్య నిర్ధారణ పరీక్షలు, వినికిడి నిర్ధారణ పరీక్షలు చేసి, లోపం ఉన్న వారికి వినికిడి యంత్రాలు, శారీరక వైకల్యం ఉన్న వారికి వీల్ చైర్స్, ట్రైసైకిల్స్, రోలేటర్స్, బుద్ధి మాంద్యం కలిగిన వారికి యేమ్, ఆర్‌కిట్స్, దృష్టిలోపం ఉన్న వారికి బ్రెయిలీ కిట్స్ వంటి ఉపకరణాలను అందజేస్తారని చెప్పారు. క్యాంపునకు వచ్చే విద్యార్థులు సదరం క్యాంప్ ద్వారా తీసుకున్న వైకల్యం ధ్రువీకరణ పత్రాల జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు వెంట తీసుకుని రావాలని ఆయన కోరారు.

ప్రపంచ వ్యాప్తంగా రోటరీ క్లబ్ సేవలు


క్లబ్ వ్యవస్థాపకుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

అద్దంకి రూరల్: ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాల్లో రోటరీక్లబ్ సేవలు అందిస్తుందని రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ప్రపంచ రోటరీ దినోత్సవం అద్దంకిలోని క్లబ్ సెక్రటరీ చిన్ని మురళీ కృష్ణ ఆఫీస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు రోటరీ క్లబ్ వ్యవస్థాపక చైర్మన్ పాల్ హరీస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడు మాట్లాడుతూ 200 దేశాల్లో శాఖలు కలిగి సుమారు 4 బిలియన్ డాలర్ల ఖర్చుతో పోలియో నిర్మూలనతోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ చిన్ని మురళీకృష్ణ, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, సభ్యులు మహమ్మద్ రఫీ, లెవీ ప్రసాద్, మమన్నం త్రిమూర్తులు, జ్యోతి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులకు బహుమతి


విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ ఈఓ కిరణ్‌కుమార్

కారంచేడు: మండలంలోని యర్రంవారిపాలెం విద్యార్థులు జిల్లాస్థాయిలో తమ ప్రతిభ కనబరిచారు. గురువారం జిల్లా కేంద్రం బాపట్లలో నిర్వహించిన సైన్స్ పోటీల్లో యర్రవారిపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థలు యర్రం జ్యోతికృష్ణ, జ్ఞానేస్వరిలు తమ సత్తా చాటారు. ఎత్తులు కొలవడం ఎలా అనే ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి వచ్చిందని హెచ్‌ఎం మల్లికార్జునరావు, పర్చూరు ఉప విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్, రామకృష్ణ అభినందించారు.

గుండె జబ్బులపై అవగాహన కలిగి ఉండాలి

చినగంజాం: ప్రతి వ్యక్తి ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని గుంటూరు శ్రావణి హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ వినయ్ అన్నారు. గురువారం ది ఇంకొల్లు మండల హెల్త్ ఫస్ట్ ఎయిడర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని గొల్లపాలెం గ్రామంలో ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరం నిర్వాహణకు ఇంకొల్లు వార్డు సభ్యులు వెనిగండ్ల శ్రీకాంత్ సహకరించగా వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించారు. మొత్తం 127 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 24 మందికి గుండె జబ్బులు ఉన్నట్లుగా గుర్తించారు.